'నేడు యథావిధిగా జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్-ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ఎస్‌టి పునరుద్ధరణ అయ్యే వరకూ పోరాటం

వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకులు ఎస్‌టి పునరుద్ధరణ జరిగే వరకు జాతి ఫస్ట్, పార్టీ నెక్స్ అనే నినాదంతో పోరాటం చేయాలని వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం దొమ్మన్న బావి వద్ద వాల్మీకి గర్జన సభను నిర్వహించారు. సభకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పార్టీలకు సంఘాలకు అతీతంగా వాల్మీకి సంఘం నాయకులు ప్రజలు హాజరయ్యారు. సమావేశంలో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకుల చిరకాల వాంఛ ఎస్‌టి సాధనకు దశాబ్దాల తరబడి సంఘం నాయకులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు వాల్మీకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయం పట్టించుకోకుండా రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. దీనికి కారణం వాల్మీకుల్లో వర్గాలు సృష్టించి మనలో ఐకమత్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. కేవలం వాల్మీకులను ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు చూస్తున్నాయన్నారు. వాల్మీకులను ఎస్‌టి పునరుద్ధరణకు సహకరించని పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అందుకోసం వాల్మీకుల్లో చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ముందుగా విద్యార్థులు, యువత వాల్మీకుల ఎస్‌టి పునరుద్ధరణ పోరాటంలో ముందుకు రావాలని కోరారు. అప్పుడే మనం అనుకున్నది జరుగుతుందన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో వాల్మీకులు జాతి ఫస్ట్.. పార్టీ నెక్స్ అనే నినాదంతో వాల్మీకుల ఎస్టి పునరుద్ధరణ ఉద్యమంలో ముందుకు రావాలన్నారు. పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగివచ్చి ఎస్టి పునరుద్ధరణకు సహకరిస్తాయన్నారు. ఆంధ్రాలోని వాల్మీకి సోదరులకు కర్ణాటక రాష్ట్రంలోని వాల్మీకిసోదరులంతా మద్దతుగా ఉంటారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి గర్జన సభ నిర్వహణ కమిటీ సభ్యులు యనమల నారాయణ, కుప్పం సురేష్, రమణ, కొండయ్య గారి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, అనిల్, రాము, హరి, మనోహర, వెంకటరమణ అదేవిధంగా వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ సంఘం నాయకులు సద్దల జయసింహ, వలసల మంజు, మద్దయ్య గారి వెంకటరమణ పాల్గొన్నారు.

గర్జన సభలో నినాదాలు చేస్తున్న వాల్మీకులు

లంకె బిందెలు ఆశ చూపి..

రూ.2.50 లక్షల దోపిడీ

న్యాయం చేయాలంటూ బాధితురాలు వేడుకోలు
ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన

ప్రజాశక్తి-పీలేరు

లంకె బిందెలు ఆశ చూపి ఓ మహిళను కొందరు మోసం చేశారు. ఆమె వద్ద నుంచి రూ. 2.5 లక్షలు స్వాహా చేశారు. ఈ సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం బాధితురాలి వివరాల మేరకు.. పీలేరు పట్టణం తిరుపతి రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ నూనె విత్తుల కర్మాగారం సమీపంలో వీవర్స్ కాలనీలో మల్లిక, ఆమె కుమారులు నాగేంద్ర, బాలరాజు, కోడలు ప్రసన్న నలుగురు కలిసి నివాసముంటున్నారు. వారి పక్కింటిలోని రేపన వసంతమ్మ నివాసముంటుంది. ఆమె అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తాము అక్కదేవతలకు పూజలు చేస్తుంటే 21 లంకె బిందెలు దొరికాయని, వాటిలో వసంతమ్మకు వాటా ఇస్తామంటూ నమ్మబలికారు. అందుకు రూ.21 వేలు కావాలనడంతో వారి మాటలు నమ్మి బాధితురాలు డబ్బులు ఇచ్చింది. మరుసటి రోజు మరో రూ.51 వేలు, ఇలా పలు మార్లు ఆమె భర్తకు తెలియకుండా సుమారు రూ.2.50 లక్షలు ఇచ్చింది. ఆమెకు వారిపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మల్లిక కుటుంబ సభ్యులు స్టేషన్‌కు పిలిపించి తీసుకున్న నగదు బాధితురాలు వసంతమ్మకు ఇవ్వాలని చెప్పారు. సుమారు 8 నెలలుగా డబ్బులు ఇవ్వకుండా వాయిదా వేస్తున్నారని, పోలీసు ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంది.

బాధితురాలు వసంతమ్మ

రేపు యానిమేటర్ల 36 గంటల ధర్నా

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎ. రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 10 , 11 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట యానిమేటర్ల 36 గంటల ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన యానిమేటర్ల మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానిమేటర్లకు మూడేళ్ల కాల పరిమితి వరకే ఉద్యోగం ఉండేలా విడుదల చేసిన జీవో నంబర్ 64ను వెంటనే రద్దు చేయాలని చెప్పారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతికి తోడ్పడే 28 వేల మంది యానిమేటర్ల కుటుంబాలు ప్రభుత్వ అనాలోచనతో వదిలిన 64వ సర్క్యులర్ తో రోడ్డున పడతారని వాపోయారు. ప్రభుత్వం పునరాలోచించుకొని మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 8 వేల వేతనంలో ప్రభుత్వ యాప్‌లకు, రవాణా ఖర్చులకు రూ. 3వేలు ఖర్చు పోగా కేవలం రూ. 5 వేలతో కుటుంబాలు నెగ్గుకు రావాలంటే చాలా ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. జీతాలు రాక, చేసిన అప్పులతో ఆందోళన గురవుతున్నారని చెప్పారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, పెరిగిన ధరలతో తీవ్ర ఇక్కట్లతో మానసిక క్షోభకు గురువుతన్నారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యానిమేటర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రెడ్డెప్ప, ఉపాధ్యక్షులు క్రిష్ణమ్మ మాట్లాడుతూ ధరలకనుగుణంగా కనీసవేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, సిబిఒహెచ్ఆర్ అమలు చేసి సంఘాల మెర్జింగ్ ఆపాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలో గ్రూపులు తక్కువ ఉన్నాయనే నెపంతో విధుల నుంచి తప్పించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. జిల్లాలోని యానిమేటర్లు 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యానిమేటర్లు కన్యాకుమారి, చెన్నమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

గాంధీపురంలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గాంధీపురంలో బియ్యం పంపిణీతో పాటు సత్వర సమస్యలు పరిష్కరించాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీపురంలో ఇంటింటికీ బిఎస్‌పి కార్యక్రమంలో భాగంగా ఏనుగు గుర్తు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఎస్‌పి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్‌సిల ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు దళితుల సమస్యలు పట్టించుకున్న పాపానికి పోలేదని వాపోయారు. స్థానిక అధికారులకు సమస్యలను అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. దళితులు ఓట్లతో అధికారంలోకి వచ్చి వారి సమస్యలు మాత్రం పట్టని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని ప్రజలు దగ్గర్లోనే తరిమి కొడతారని, ఓట్ల రూపంలో రాబోయే ఎలక్షన్లలో బుద్ధి చెప్తారని తెలియజేశారు. కూలీకి వెళ్తే కాని పూటగడవని పేదలు ఉన్న ఇలాంటి కాలనీల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి పేర్కొన్నారు. గాంధీపురం వాసులకి బియ్యం పంపిణీతో పాటు కాలువలు శుభ్రం చేసి అనారోగ్యానికి గురు కాకుండా చూడాలని కోరారు. సోమవారం సాయంత్రం లోపు సమస్యలకు పరిష్కారం చూపునట్లయితే మంగళవారం రోజున నిరసన కార్యక్రమం చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో గాంధీపురం బిఎస్‌పి మహిళా లీడర్లు సంధ్య రాణి ప్రసన్న స్థానిక బిస్‌పి నాయకులు రమణ, బాలాజీ, గంగాధర్, శివ, అనిల్, శీను, ప్రశాంత్, మహేష్ కన్నా, రవి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

పర్యాటకంపై 'ఇంటాక్' విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లాతో పాటు, అన్నమయ్య జిల్లాలో కూడా పర్యాటకంపై విస్తృతంగా ప్రచారం చేస్తామని బిసి సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పర్యాటకానికి పట్టాభిషేకం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేస్తున్న కొత్త పర్యాటక పాలసీలో భాగంగా జిల్లాలో పర్యాటక అభివృద్ధి వేగం పుంజుకుందని తెలిపారు. అదే స్థాయిలో అన్నమయ్య జిల్లాలోని పర్యాటక ప్రాంతాలుకూడా అభివృద్ధి కావాల్సిన అవసరం గురించి పలు సూచనలు చేశారు. గౌరవ అతిథి యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కూడా పలు ఆకర్షణీయమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటి గురించి విస్తృతంగా అధ్యయనం చేసేందుకు ఉత్తరాది ప్రాంతాల ఇంజినీరింగ్ విద్యార్థులు వస్తూ ఉండడం ఈ ప్రాంత పర్యాటక ఘనతను గురించి తెలుపుతుందన్నారు. ఇంటాక్ కన్వీనర్ మానస కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ సంస్థను అన్నమయ్య జిల్లాలో కూడా ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ కృషి చేస్తున్నదని తెలిపారు ఈ మేరకు రాజంపేట, రాయచోటిలలో 12 మందికి పైగా సభ్యులు ముందుకు వచ్చారని మరికొందరు సభ్యులను కూడా చేర్చి ఇంటాక్ సంస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఒంటిమిట్ట నుంచి కుక్కల దొడ్డి వరకు ఎన్నో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటి గురించి విస్తృత ప్రచారం చేసేందుకు తొలి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఇటీవల రాష్ట్ర టూరిజం శాఖ నుంచి మూడవసారి ఉత్తమ పర్యాటక పాత్రికేయుడుగా అవార్డు అందుకున్న పవన్ కుమార్ పంతుల, ఉత్తమ పర్యాటక ఫోటోగ్రాఫర్ గా అవార్డు స్వీకరించిన కొండూరు జనార్ధన రాజు, ఇంటాక్ జాతీయ కార్యశాలకు ఎంపికై ప్రత్యేక శిక్షణ పొంది వచ్చిన సభ్యులు గునిశెట్టి శ్రీనివాసులు, బోగాల కొండారెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన కల్లూరు బాల ఎల్లారెడ్డిలను ఈ సందర్భంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్, లయన్స క్లబ్ సంస్థలతో కలిసి ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో మూడు సంస్థల సభ్యులు, పర్యాటక శాఖ అభిమానులు హాజరయ్యారు.

సంస్థ సభ్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మందుల దుకాణాలకు

లైసెన్సులు తప్పనిసరి

నాణ్యమైన మందులు అందించడమే లక్ష్యం
జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్. జయరాముడు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని ప్రజలందరికీ నాణ్యమైన మందులు అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్. జయరాములు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో నాణ్యమైన మందులు, లైసెన్సులు, ప్రజలు ఎలాంటి మందులు వాడాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో ఔషధ కార్యాలయాల అధికారులు, వారి వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఔషధ తనిఖీ అధికారి కార్యాలయాలు రాయచోటి, మనదపల్లెల్లో రెండు ఉన్నాయి. జిల్లా ఔషధ నియంత్రణ కార్యాలయం జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఉంది.

ఔషధ కార్యాలయాల పని విధానాలేంటి?

డ్రగ్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ అమలు చేస్తాం. దీంతోపాటు డ్రగ్స్ అండ్ మ్యాజిక్, మందుల తయారీ కంపెనీలను తనిఖీ చేయడం, లైసెన్సులు మంజూరు చేయడం అలాగే షాపుల మార్పిడికి పరిశీలించడం, లైసెన్సులు జారీ చేయడం జరుగుతుంది. జిల్లాలో మందుల నిరంతరం తనిఖీ చేయడం, బ్లడ్ బ్యాంకుల్, ఆక్సిజన్ యూనిట్లు, మందుల దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించుకుండా చూడడం, నిబంధనలను పాటించిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

జిల్లా వ్యాప్తంగా మందుల దుకాణాలు ఎన్ని ఉన్నాయి?

రాయచోటి ఔషధ తనిఖీ కార్యాలయ పరిధిలో 630 మందులు షాపులున్నాయి. ఇందులో 550 రిటైల్, 64 హోల్ సేల్ షాపులున్నాయి. రాయచోటిలో దీప బ్లడ్ బ్యాంక్ ఒకటి అందుబాటులో ఉంది. రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూర్ ప్రాంతాలలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ స్టోర్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. మదనపల్లి ఔషధ తనిఖీ కార్యాలయాల పరిధిలో 620 మందుల షాపులున్నాయి. ఇందులో 494 రిటైల్,126 హోల్ సేల్ షాపులున్నాయి. బ్లడ్ బ్యాంకులు మదనపల్లె, పీలేరు ప్రాంతాలలో అందుబాటులో ఉన్నాయి. పీలేరులో ప్రభుత్వ ఆసుపత్రిలోబ్లడ్ స్టోరేజ్ సెంటర్ అందుబాటులో ఉంది.

జిల్లాలో కేసులు ఏమైనా నమోదు చేశారా?

ప్రతి నెల 40 మందుల దుకాణాలను తగ్గకుండా తనిఖీ చేస్తున్నాం. తనిఖీలలో మందుల దుకాణాలకు లైసెన్సులు, నూతన దరఖాస్తులు, దుకాణాలు మార్పిడి, లైసెన్స్ కండిషన్, చట్ట పరిధిలో పనిచేస్తున్నయా లేదా అని పరిశీలిస్తున్నాం. ఎవరైనా మందుల నాణ్యత అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రాయచోటి ప్రాంతంలో ఇప్పటివరకు 13 కేసులు నమోదు చేశాం. మదనపల్లె పరిధిలో తొమ్మిది కేసులను నమోదు చేశాం. లైసెన్సు లేకుండా, మందలను అధిక ధరలకు కేసు నమోదు చేస్తాం. ప్రతినెల నాణ్యత ప్రమాణాలకు పరిశీలించడానికి మందుల దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి పరిశీలనకు విజయవాడ ల్యాబరేటరికి పంపిస్తున్నాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న వారితో విధులను నిర్వహిస్తున్నాం. త్వరలోనే నూతన సిబ్బందిని నియామకానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలకు ఏమైనా సలహాలు ఇవ్వాలను కుంటున్నారా?

ఔషధులు అనేవి విషపూరితమైన పదార్థాలు వంటివి. కావున వాటిని అవసరమేరకు వైద్యులు సూచించిన మేరకు మాత్రమే కొనుగోలు చేయవలెను. స్వంత వైద్యం ప్రాణాంతకం. లైసెన్స్ కలిగిన మందుల దుకాణాల్లో మాత్రమే వైద్యులు సూచించిన మందులను కొనుగోలు చేయాలి. అనవసరంగా మందులను వాడరాదు. లైసెన్స్ లేని షాపుల్లో మందులు కొనరాదు. అ టువంటి షాపులు ఏవైనా ఉంటే మీ పరిధిలోని ఔషధ తనిఖీ కార్యాలయాలకు dca-grams@ap. gov.in, 08632330909 ఫిర్యాదు చేయాలి.

థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శిస్తున్న మిట్స్ విద్యార్థులు

ఆర్‌టిపిపిని సందర్శించిన
'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో మెకానికల్ విభాగంలో బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పరిశ్రమల సందర్శనలో భాగంగా ప్రొద్దుటూరు లోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో ఇదీ ఒకటి అని, ఇందులో విద్యుత్‌ను తయారుచేసే విధానాలను అక్కడ ఉన్న సాంకేతిక పరికరాలను చూసి విద్యార్థులు అవగహన పెంచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఇందులో 210 మెగావాట్లు న్న 5 యూనిట్లు, 600 మెగావాట్లు ఉన్నవి 1 యూనిట్ ఉన్నాయన్నారు. ఈ ఐదు ప్లాంట్ల విద్యార్థులు సందర్శించినట్లు ఆయన అన్నారు. విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తిపై ప్రాక్టీకల్‌గా వారు గ్రహిస్తే వారి భవిష్యత్‌కు ఉపయోగ పడుతుందని ఆయన అన్నారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు రాజేష్, రఘులో ఇందులో పాల్గొన్నట్లు ఆయన అన్నారు.

ఖాదర్‌బాషాను సన్మానిస్తున్న షైన్ సొసైటీ సభ్యులు

గుర్రం జాషువా అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

గుర్రం జాషువా జాతీయస్థాయి జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న ఖాదర్‌బాషకు పీలేరులో అభినందన కార్యక్రమం చేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఎంపిక చేసి గత నెల 24న హైదరాబాదులో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని, జాతీయ స్థాయి జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న వారిలో అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, అంతర్జాతీయ బహుభాషా రంగస్థల, టివి, సినీ కళాకారుడు ఖాదర్ బాష కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక విఎస్ నర్తనశాలలో షైన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయనకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఖాదర్ బాష బాల నటుడిగా నటన జీవితాన్ని ప్రారంభించి అంచలంచెలుగా బహుభాషా అంతర్జాతీయ కళాకారుడి స్థాయికి ఎదిగి తన సొంత ఊరికి వన్నె తెచ్చారని అన్నారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలన్న లక్షణాలు ఖాదర్ బాషాలో మెండుగా ఉన్నాయని వారు ప్రశంసించారు. పీలేరు లాంటి చిన్న ప్రాంతంలో ఆయన ఉంటున్నా విశ్వ ఖ్యాతి చెందిన దేశాల్లోనే కాకుండా, మన దేశ ప్రధాన నగరాల్లోని అనేక చోట్ల ఈ నటుడు ఎన్నో ప్రదర్శనల్లో పాల్గొని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును, స్థానాన్ని, పేరు, ప్రఖ్యాతులను తెచ్చుకోవడం పీలేరుకే గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి, సత్కరించారు. కార్యక్రమంలో విఎస్ నర్తనశాల వ్యవస్థాపకులు, సీనియర్ రంగస్థల, టీవీ, సినీ కళాకారులు వి. మయూర్ నాథ్ శర్మ, ప్రముఖ కవి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సరస్వతీ శ్రీరామరాజు, షైన్ సొసైటీ అధ్యక్షులు బాబ్ జాన్, అపిట్కో ప్లేస్మెంట్ ఆఫీసర్ చిరంజీవి (జాఫర్), వార్డు సభ్యులు హబీబ్ బాష, యూట్యూబర్లు సురేష్, మల్లికార్జున, మహేష్, విజయ్, కృష్ణ, బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో వైద్యులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

23 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, యర్రావారిపాలెం, కె.వి. పల్లి,కలకడ, కలికిరి, పెద్దమండెం, గుర్రంకొండ, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి అందులో అర్హులైన 23 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు.అలాగే కంటి ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారి వెంట ఉండే వారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, కంటి ఆస్పత్రి కోశాధికారి శివప్రసాద్ రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలీ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు సిబ్బంది

'వెలుగు'లో ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలం కోళ్ళ బైలు పంచాయతీ , అమ్మచెరువు మిట్టలోని వెలుగు సంస్థలో ప్రపంచ డిస్లెక్సియా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, వెలుగు ప్రిన్సిపల్ లీనాకుమారి విచ్చేశారు. మొదటగా వెలుగు సిబ్బంది స్వీటి ముఖ్య అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ డిస్లెక్సియా డే అనేది , చదవడం, రాయడం, నైపుణ్యాలను ప్రభావితం చేసే అభ్యాస వైకల్యం గురించి అవగాహన పెంచడమే ముఖ్య లక్ష్యమని తెలిపారు. డిస్లెక్సియాతో బాధపడుతున్న వ్యక్తులకు మద్దతు, అవగాహనను ఈ రోజు ప్రోత్సహిస్తుందని తెలిపారు. విద్య, ఆమోదాన్ని ప్రోత్సహించడానికి ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు, ఈవెంట్‌లు నిర్వహించబడతాయని తెలిపారు . డైస్లెక్సియాతో బాధపడేవారిని శక్తిమంతం చేయడానికి ,కలుపుకొని నేర్చుకునే వాతావరణాన్ని ప్రోత్సహించడానికి తాము సంఘీభావంగా ఉంటామని తెలిపారు. అనంతరం వెలుగు సిబ్బంది అందరూ కలిసి ఆటలతో, పాటలతో బోధనా పద్ధతులను ఎంతో చక్కగా వివరించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి , వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి , వెలుగు సిబ్బంది స్వీటీ, జయంతి , చిన్నారులు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ధర్మానాయక్‌కు సన్మానం

ప్రజాశక్తి - రాయచోటి

యుపిఎస్‌సి నిర్వహించిన పరీక్షల్లో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ లో ఎంపికైన రాయచోటి శ్రీ దేవపట్ల హరినాథ్ రెడ్డి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి బి.ధర్మానాయక్‌ను ఆ కళాశాల కరస్పాండెంట్, టిటిడి గోశాల సభ్యులు దేవపట్ల రామ సునీల్ రెడ్డి ఆదివారం శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ మాట్లాడుతూ కేంద్ర ప్రసార సమాచార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా బి.ధర్మానాయక్ విధులు నిర్వహిస్తున్నారన్నారు. తమ కళాశాలలో చదువుకొని ఉన్నత ఉద్యోగం సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంకా బాగా పనిచేసి ఉన్నత స్థాయికి అధిరోహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రెడ్డప్పరెడ్డి, ఇన్‌ఛార్జి జనార్దన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థిని సన్మానిస్తున్న కరస్పాండెంట్

యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

శ్రీనివాసరాజుకు టూవీలర్ అసోసియేషన్ మద్దతు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాజీ డిఆర్‌డిఎ రాష్ట్ర అధికారి యల్లటూరు శ్రీనివాసరాజుకు నియోజకవర్గంలోని టూవీలర్ అసోసియేషన్ నాయకులు తమ మద్దతును తెలిపారు. ఆదివారం యల్లటూరు భవన్‌లో టూవీలర్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఉన్నత ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ప్రజల కోసం ఉద్యోగాన్ని రాజీనామా చేసి ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతున్న మహోన్నత వ్యక్తి శ్రీనివాసరాజు అని కొనియాడారు. రాజంపేటలో ఆటో షెడ్ నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన యూనియన్ నాయకులకు హామీ నిచ్చారు. కార్యక్రమంలో సింగంశెట్టి నరేంద్ర, మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, ఆకుల చలపతి, నాసర్,నాసర్ ఖాన్, అసోసియేషన్ వ్యవస్థాపకులు సుభాన్, అధ్యక్షులు రాము, ఉపాధ్యక్షులు రవి, సలహాదారులు కాలేషా, కోశాధికారి హరి, కార్యదర్శి అబ్దుల్లా, అజీజ్, రవి, నజీర్, సుబ్బరాజు, అమీర్, మొహమ్మద్, బాష, అంజి, రఫీ, శఫీ, ఇస్మాయిల్, హాజర్, హరి, లోకేష్, వాహిద్, కళ్యాణ్, బాలాజీ, జిలాని బాషా పాల్గొన్నారు.

నేరాల అదుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రికార్డులను పరిశీలిస్తున్న సిఐ మధు

మండలంలో నేరాలను పూర్తిగా అదుపు చేసేందుకు పోలీసులు కృషి చేయాలని ములకలచెరువు సిఐ మధు కోరారు. ఆదివారం ఆయన తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్లో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నేరాల , ఫిర్యాదులు, తదితర అంశాలపై ఎస్ఐ లోకేష్‌రెడ్డిని అడిగి తెలుసు కున్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఇప్పటినుంచి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో తిరిగి ప్రజలతో స్నేహభావంతో మెలిగి పోలీస్ అంటే భయం అనే విషయాన్ని దూరం చేయాలన్నారు. ఎలాంటి అసాంఘిక జరిగిన ప్రజలు కార్యక్రమాలు,మహిళా పోలీసులు, పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న వెంటనే స్పందించి వాటిని అడ్డుకట్ట వేయాలన్నారు.

డ్రెయినేజీ పనులు చేస్తున్న సిబ్బంది

ముమ్మరంగా డ్రెయినేజీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలో ఎన్నడూ లేని విధంగా డ్రెయినేజీ నిర్మాణపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ నీలోఫర్ మైనుద్దీన్ల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.66 లక్షల నిధుల విడుదలకు ఎమ్మెల్యేకి కృషి చేశారని చెప్పారు. పనులు నాణ్యతగా, త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జీనత్‌షఫీకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ సిఎం

ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలో ఉర్దూ కళాశాల, డైట్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పీలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టిన షేక్ జీనత్ షఫీ స్వగృహానికి ఆయన విచ్చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప ముఖ్యమంత్రితో మాట్లాడుతూ పీలేరు పట్టణంలో ముస్లిం జనాభా అధిక శాతంలో ఉందని, ఇక్కడి ముస్లిం విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశం లేక 10వ తరగతితోనే చదువు మానేసే పరిస్థితి ఉందని తెలియజేశారు. తిరుపతి చిత్తూరు మదనపల్లి రాయచోటి కేంద్రాలకు సమాన దూరంలో ఉన్న పీలేరు పట్టణానికి ఓ ఉర్దూ జూనియర్ కళాశాలను, ఉర్దూ డైట్ కళాశాలల మంజూరుకు సహకరించాలని విజ్ఞప్తి కోరారు. స్పందించిన ఉపముఖ్యమంత్రి తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని నంద్యాల రోడ్డులోని విఆర్ జూనియర్ కళాశాల ఆవర ణలో ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ వైద్యులు రామఅనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వందలాది మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. ఈ సందర్భంగా వైద్యులు రామ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రతివారం మైదుకూరు నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్త పరీక్షలతోపాటు ఇసిజి ఇతర పరీక్షలను ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి కళాశాల కరస్పాండెంట్ ఎస్ వెంకటరాముడు, ప్రముఖ న్యాయవాది కె శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపల్ బి తిరుమలేష్, సామాజిక కార్యకర్త చెన్నకేశవ, రాము సహకరించారు. కార్యక్రమంలో కర్నూల్ మెడికవర్ సిబ్బంది బివి కొండారెడ్డి, ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై దాడులు అభినందనీయం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో అసాంఘిక శక్తులపై ఎస్‌పి ఆధ్వర్యంలో దాడులు చేయడాన్ని అభినందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూరోడ్డు లోని తన కార్యాలయంలో ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి వచ్చిన కొద్ది రోజుల్లోనే జిల్లాను అవగాహన చేసుకుని ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి స్థానిక పోలీసులకు తెలియకుండా స్పెషల్ పోలీసులను పంపించి పొద్దుటూరులో క్రికెట్ బుకీలను అరెస్ట్ చేసి కడపకు తరలించడం హర్షణీయమన్నారు. ఇలాంటి దాడులు ఇంకా కొనసాగించాలన్నారు. మరిన్ని అసాంఘిక కార్యక్రమాలు ప్రొద్దుటూరులో జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఆయన కోరారు. దష్టి సారించాలని కోరారు. నాలుగేళ్లుగా ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, పేకాట విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉన్నట్టా...లేనట్టా?

సందేహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

యథావిధిగా ప్లాస్టిక్ వినియోగం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పర్యావరణానికి ముప్పుగా భావిస్తున్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉన్నట్లా,లేనట్లా అని అటు పర్యావరణ వేత్తలు, ఇటు ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని ఆపాలని, పూర్తిగా నిషేధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మండలంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన కొద్ది రోజులపాటు ప్లాస్టిక్ కవర్లు వాడకాన్ని అరికట్టారు. ఎప్పటి కప్పుడు దుకాణాలు, తోపుడుబండ్లు, వీధి వ్యాపారాలకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించి, పకడ్బందీగా ప్లాస్టిక్ కవర్లు వాడకాన్ని నియంత్రించారు. ప్రస్తుతం బి.కొత్తకోట పట్టణంతో పాటు మండలంలో యధావిధిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. .విచ్చలవిడి ప్లాస్టిక్ వాడకం అటు పర్యావరణానికి, ఇటు ప్రజల ఆరోగ్యంపై పెనుప్రభావం చూపే ప్రమాదం ఉందని పర్యా వరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దుకాణ దారులు, వీధి వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్లు లేకపోతే వినియోగదారులతో తిప్పలు తప్పడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ కవర్ల స్థానంలో పర్యావరణాన్ని పరిరక్షించే బ్యాగులను తీసుకురావాలని ప్రజల అభిప్రా యం వ్యక్తం చేస్తు న్నారు.ఈ విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగర పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ వినియోగం దృష్టిసారించి అరికట్టాలని ప్రజలు కోరు తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు

న్యాయస్థానంలో ధర్మమే జయిస్తుంది

రిలే దీక్షలో టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై నమోదు చేసిన అక్రమ కేసులలో న్యాయస్థానంలో ధర్మమే జయిస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ చంద్రబాబు స్క్వాష్ పిటిషన్, బెయిల్ పిటిషన్లపై సోమవారం సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభవంతో ఉన్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి 28 రోజులుగా జైల్లో రిమాండ్‌లో ఉంచడం బాధాకరమని , నిరసనగా టిడిపి కార్యాలయం వద్ద ప్రతిరోజు నిరసన కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించిన నాయకుడిపై అక్రమ కేసులు బనాయించడం ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికలలో వైసిపికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణ, జయప్రకాష్, కొమ్మశివ, దుద్యాల జయచంద్ర, అనిత దీప్తి, రామచంద్రయ్య, బాలాజీ నాయుడు, గిరిధర్ నాయుడు, రమేష్, తులసి వెంకటేష్ పాల్గొన్నారు.**రాజంపేట అర్బన్ :** చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్మెంట్ నిధులు స్వాహా అయ్యాయని కేవలం అనుమానంతో అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడం సిఐడికి ఎంత మాత్రం తగదని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆర్ఎస్ రోడ్డులో డి.ఆర్.ఎల్ లాడ్జి ఎదురుగా బత్యాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా ఆదివారం జరిగిన 26వ రోజు రిలే నిరాహార దీక్షకులకు ఒంటిమిట్ట, రాజంపేట, సిద్ధవటం మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ సిఐడి రాష్ట్రంలో జగన్ చట్టాలను అమలు చేస్తూ చంద్రబాబును ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు సమర్పించలేకపోయారని తెలిపారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట, సిద్ధవటం, నందలూరు, రాజంపేట మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టమోటా ధరలు పతనం

- పంటను పొలాల్లోనే వదిలేసిన రైతులు

రోడ్డుపై పారేసిన టమోటా పండ్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టమోటా ధరలు భారీగా పడిపోవడంతో రైతులకు కన్నీళ్లు మిగిలాయి. నెలరోజుల కిందట వందల్లో పలికిన టమాటా ధరలు ఇప్పుడు దారుణంగా పడిపోయాయి. రూ.5 కూడా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. టమాటాకు ధరలు లేక రైతులు రోడ్ల మీద పారబోస్తున్నారు. టమోటా ధరలు జూలై, ఆగస్టు నెలలో కిలో కూ.150 వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో రైతులు టమోటా పంట సాగు చేయడంతో విస్తీర్ణం బాగా పెరిగింది. పులివెందుల నియోజకవర్గంలో లింగాల, పులివెందుల, వేముల మండలాలలో దాదాపు 1020 ఎకరాల్లో పంట సాగు చేశారు. ధర బాగా తగ్గడంతో కనీసం ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు అన్ని మార్కెట్‌లలో ఇదే పరిస్థితి. కిలో టమాటా పులివెందుల మార్కెట్‌లో రూ.3 పలుకుతోంది. మదనపల్లి మార్కెట్‌లోనూ ధరలు దారుణంగా పడిపోయాయి. ధరలు భారీగా తగ్గిపోయాయని, దీని వల్ల కోత, రవాణా ఖర్చులు సైతం రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఏపీలోని అన్ని మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా పంట చేతికందడంతో రేటు దారుణంగా పడిపోయింది. అంత తక్కువ ధరకు గిట్టుబాటు కాదని రైతులు మార్కెట్‌కు తెచ్చిన టమోటాలను అమ్మకోలేక, తిరిగి తీసుకెళ్లలేక కింద పడవేసి వెళ్తున్నారు. ధరల స్థిరీకరణ తీసుకువచ్చామన్న ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతోనే ధరలు పెరగడం, తగ్గడం జరుగుతోందని తెలిపారు. దీంతో రైతులు ఎప్పుడు పంట వేయాలో తెలియక భారీగా నష్టపోవాల్సి వస్తుంది. టమోటా ధరలు నిలకడగా ఉండేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే పంటను కొనాలి : రైతులు పండించిన టమోటా పంట ధర తగ్గినప్పుడు ప్రభుత్వమే నేరుగా కొనాలని లింగాల మండలం ఇప్పట్ల గ్రామరైతు సారెడ్డి రామ్మోహన్‌రెడ్డి సూచిస్తున్నారు.

టమోటా పండ్లను పొలాల్లోని వదిలేసిన రైతు

నీటి కేటాయింపుల్లో అన్యాయం చేస్తే పోరాటానికి సిద్ధం

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది నీటి కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగితే మరో పోరాటానికి సిద్ధమవుతామని అఖిల పక్ష నేతలు హెచ్చరించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం అధ్యక్షతన కృష్ణానది నీటి కేటాయింపులపై అఖిలపక్ష పార్టీ, ప్రజాసంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన ట్రిబ్యునల్స్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిని పునః పంపిణీ పేరుతో ఎపి, తెలంగాణ, రాష్ట్రాలకే పరిమితం చేస్తూ బాధ్యతలను బ్రిజేష్‌కుమార్ ట్రిబనల్‌కు కట్టబెట్టి తద్వారా తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి కుట్రలు చేస్తున్నట్లు విమర్శించారు. అడుగడుగునా రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా స్పందించని వైసిపి చేతకానితనానికి నిదర్శనమన్నారు. సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం, ఏరియా కార్యదర్శి వెంకట రాములు మాట్లాడుతూ ఒకవైపు కేసు విచారణలో ఉండగానే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కళ్ల ముందే అన్యాయం జరుగుతుంటే కళ్లప్పగించి చోద్యం చూడడం సిగ్గుచేటని విమర్శించారు. 9న కడప కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తీర్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, అమర్నాథ్‌రెడ్డి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు రహమతుల్లా, గౌస్ బాబా, పీర్ బాషా, మౌలా, తాజ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న ఆయా పార్టీల నాయకులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

చాపాడు :మండల పరి ధిలోని పల్లవోలు గ్రామ సమీపంలో ఉన్న కాశినాయన వృద్ధాశ్రమంలో ఆదివారం ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ రెండవ కుమారుడు మాచనూరు శివతేజ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశామన్నారు. అనంతరం రాఘవయ్య వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాశినాయన ఆశ్రమ నిర్వాకులు వెంకటయ్య పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిలో ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పని వత్తిడి పెరిగిపోయి ఆశా వర్కర్లు మానసిక వత్తిడికి గురవతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ కుమార్ పేర్కొ న్నారు. స్థానిక సిఐటియు కార్యాల యంలో ఆదివారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డుతూ.. ఆశా వర్కర్లపై పని భారం ఎక్కువగా ఉందన్నారు. ఉదయం ఆరు గం టల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు నిమగ్నమై ఉండాల్సి వస్తోందని ఆవే దన వ్యక్తం చేశారు. ఇలా రోజుకు 16గంటలు పని చేస్తు న్నారన్నారు. ఆదివారాలు సెలవులుండవ్.. బంధువులు ఎవరైనా చనిపోతే సెల వులిచ్చే విషయంలో ఎఎన్ఎంలు, డాక్టర్లు సహకరించడంలేదన్నారు. ఈ వత్తిళ్ల తో చాలా మంది ఆశా వర్కర్లకు షుగర్, బిపి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశా రు. ఆశా వర్కర్ కృపమ్మ చనిపోయేందుకు సురక్ష వత్తిడే కారణమన్నారు. ఆశా వర్కర్లకు అడిగిన వెంటనే సెలవులు మంజూరు చేసి, పని వత్తిడి తగ్గించాలని కోరారు. వేధింపులు తగవన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

తపాలాశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు దీన దయాల్ స్పర్శ యోజన ఉపకారవేతనం ద్వారా తపాలాశాఖ వరం కల్పిస్తుందని తపాలాశాఖ సూపరిడెంట్ జి.కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో తపాలా శాఖ విద్యార్థులకు పరీక్షను నిర్వహించింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు దీన దయాళ్ స్పర్శ యోజన ఉపకారవేతన పరీక్షపై ఆయా పాఠశాలలో ముం దుగానే అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులకు ఫిలాటేలి ప్రాముఖ్యతను భవిష్యత్ తరాలకు తెలిపే ఉద్దేశంతో ఈ పరీక్ష ఉందన్నారు. డివిజనల్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ టి.దుర్గాప్రసాద్ ఇన్విజిలేటర్‌కు పరీక్ష నిర్వ హణపై జాగ్రత్తలు, విద్యార్థులకు దీన దయాల్ స్పర్శ యోజన పరీక్ష సూచ నలు తెలిపారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుశీల్ పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. పరీక్షకు 94 మంది విద్యార్థులకుగానూ 85 మంది హాజ రయ్యారు. జమ్మలమడుగు పోస్టుమాస్టర్ రమణారెడ్డి, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు దుస్తులు వితరణ

పులివెందుల టౌన్ : డాక్టర్ ఇసి గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ ఇసి దినేష్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతులకు ఆది వారం దుస్తులు వితరణ చేశారు. స్థానిక ముద్ద నూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇసి విశ్వనాథరెడ్డి డాక్టర్ గంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతిఏటా తన తండ్రి వర్ధంతి సందర్భంగా నిరుపేద విభిన్నప్రతిభావంతులకు చేయూతనందిస్తున్న డాక్టర్ దినేష్‌రెడ్డిని అభినందిస్తూ, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాగేశ్వరరెడ్డి,పసాద్, డేవిడ్ పాల్గొన్నారు.

సురేంద్రారెడ్డిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి-కలికిరి

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రెడ్డి తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సురేంద్రరెడ్డికి ఆదివారం కలికిరి మండలం స్థానిక షాదీమహల్‌లో అభినందన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ ప్రెసిడెంట్ ఆదినారాయణరెడ్డి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సు పైపడినను ప్రజలకు సేవ చేయటంలో ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. ఆర్థికంగా ఉన్నవారు తమకు తోచిన మేర ప్రజలకు సేవ చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గంలో కార్యదర్శి స్థాయికి ఎదిగినందులకు తనకు సహాయ పడిన వారిని ఎప్పటికీ మరువనని, ఎవరికి ఏ ఆపద వచ్చినా తన శాయశక్తుల సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు జి జయరాం, వై.కృష్ణారెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎం.సుబ్బరాజులుశెట్టి, ఎం పంచరత్నమ్మ, టి.సరోజమ్మ, ఎం.కాంతమ్మ, ఆదిలక్ష్మి, కె వెంకటరమణ, అక్కులప్ప, కె నాగప్ప పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం :ఆర్ఆర్

ప్రజాశక్తి-రామాపురం

టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సురకవాండ్లపల్లెలో ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న బంకుబసిరెడ్డి, వెంకటరెడ్డి, నర్సారెడ్డిలను ఆయన పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా నిచ్చిరు. రాబోయే ఎన్నికల్లో తప్ప కుండా టిడిపి విజయం సాధిస్తుందని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తంచేశారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని వచ్చేది టిడిపి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణగౌడ్, నాగబసిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చిన్నకృష్ణ, నారాయణ, రమణ, నాగయ్య, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, జీవన్‌రెడ్డి, విశ్వనాథ, వెంకటసుబ్బయ్య, రాజారెడ్డి కోటిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వేదాంతరెడ్డి, లోకనాథ్‌రెడ్డి, రఘురామ పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రమాదంలో గాయపడిన శివ

మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీ శివాలయం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓబులవారిపల్లి మండలం ముదినేపల్లి గ్రామానికి చెందిన సందాల శివ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సందాల శివ అనే వ్యక్తి తన సొంత గ్రామం ముదినేపల్లి నుంచి కడపకు వెళుతున్న సమ యం లో అధిక వేగంతో అనంతంపల్లి శివాలయం వద్ద బస్సు, లారీలు తప్పించబోయి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టారని తెలిపారు. ఈ ప్రమాదంలో అతని ఎడమకాలు విరిగిందన్నారు. స్థానికులు 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్ళారని అన్నారు. శివ హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ చిన్నంపల్లి క్రాస్ రోడ్డు వద్ద పోలీసు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూడా ఉన్నందున విద్యా ర్థులు అటు ఇటు తిరుగుతూ ఉంటారని చప్పారు. పాఠశాల విద్యార్థుల క్షేమం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎస్ఐ రఘురాంను కోరారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

కలికిరి సీకాం కాలేజీకి చెందిన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసులు వివరాల మేరకు. సీకాం కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆ కళాశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న దేవేంద్ర ప్రలోభపెట్టి తీసుకెళ్ళాడని తెలిపారు. విద్యార్థిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-కలికిరి

ఆత్మహత్యకు పాల్పడ్డ వెంకటేష్

ఉద్యోగం రాలేదని నెపంతో నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య చేసు కున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని పారపట్ల పంచాయతీ, బాలాజీనగర్ గ్రామంలో నివాసమున్న ఎ..సాయి వెంకటేష్, డిగ్రీ పూర్తి చేసి మూడు సార్లు ఉద్యోగ ప్రయత్నాలు చేశాడని చెప్పారు. ఉద్యోగం రాలేదనే బాధతో జీవితంపై విరక్తి చెంది, ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొనగా అరుపులు విన్న కుటుంబ సభ్యులు అతనిని, పీలేరుప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని పేర్కొన్నారు. మృతుని తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్‌కె. రహీముల్లా ఆదేశాలపై హెడ్‌కానిస్టేబుల్ రఫీ కేసు నమోదుచేసి నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పీలేరు

మృతిచెందిన అన్వర్

విద్యుదాఘాతంతో బీహార్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. ఆదివారం పట్టణంలోని కోటపల్లె మార్గం మధ్యంలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. బీహార్ రాష్ట్రం, మదేపురా జిల్లా, ఆఖరి గ్రామానికి చెందిన అన్వర్ అనే యువకుడు తన సహ కార్మికులతో కలసి కోటపల్లెకు వెళ్లే మార్గంలో ఓఇంటి నిర్మాణం జరుగుతుండగా రోజూ లాగే ఆదివారం కూడా అక్కడ పని చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తాకి మృతి చెందాడని తెలిపారు. ఘటనా సమాచారం తెలుసుకున్న పీలేరు ఎస్ఐ నరసింహుడు తన సిబ్బం దితో అక్కడికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.